# ఇన్‌లాండ్ కవర్ కథలు

## కనువిప్పు

ఆటో నడుపుతున్నా వెనకాల కూర్చున్నవారి మాటలు నాకు లీలగా వినిపిస్తున్నాయి. వారిలో ఒకమ్మాయి 'నా రూమ్‌లో నేను ఒక్కదానినే. అక్కడకు వెళ్దామా! లేక సినిమాకా!' అంటోంది. పక్కనున్న అతని సమాధానం నాకు వినిపించలేదు. బహుశా ఇద్దరూ ఆమె రూమ్‌కి వెళ్ళిపోతారేమో. డిగ్రీ చదివి, ఉద్యోగం రాక సంవత్సరం నుంచి ఆటో నడుపుతున్న నేను ఇలాంటివారిని చాలామందినే చూశాను. తిన్నది అరగక ఆటో ఎక్కి సాయంకాలం వరకు ఊరంతా తిరిగేవాళ్ళు, ఎక్కవలసిన బస్సు మిస్సయి ఆటో ఎక్కే ఉద్యోగస్తులు, స్టూడెంట్లు, అర్ధరాత్రి వరకు ఇంటికిరాని భర్తకోసం చూసి చూసి విసిగిపోయి కాలక్షేపానికి షాపింగ్ చేసేవారు, పొట్టకూటికై పడుపు వృత్తిలోకి దిగి, రాత్రి బేరాలు కుదుర్చుకునేవారు, ఇలా చాలా రకాలవారిని ఆటో ఎక్కించుకుని గమ్యం చేర్చి నా పొట్ట నింపుకోవడం నా వృత్తి.

ఆటో రేలంగి థియేటర్ దగ్గరకు రాగానే ఇద్దరూ ఏక కంఠంతో ఇక్కడ ఆపు అన్నారు. ఆపాను. అతను ఆటో ఫేర్లో సగం మాత్రమే నా చేతిలో పెట్టి ఆమెవేపు తిరిగి "చూడు మిస్, నువ్వు ఇందాక బస్టాప్‌లో నీ స్నేహితురాలితో అన్న మాటలన్నీ విన్నాను. మగవాళ్ళందరూ ఆడవాళ్లకోసం వెంపర్లాడతారని, ఏ మగాడైనా నీ అందానికి దాసోహం అంటాడని, నువ్వు చిటిక వేస్తే ఎలాంటివాడైనా పరుగెట్టుకుని వస్తాడని చెప్పడం విన్నాను. నువ్వు పిలవగానే వచ్చి నువ్వు కూర్చుని వున్న ఈ ఆటో ఎక్కింది నీ అందం చూసి కాదు. మా పాపకు రాత్రినుంచి జ్వరం. త్వరగా ఆఫీసు నుంచి వస్తే డాక్టరు దగ్గరకు తీసుకువెళ్దామంది నా భార్య. నేను ఎక్కవలసిన బస్సు వెళ్ళిపోయింది. ఒక్కడిని ఆటోలో వెళ్లే స్తోమత లేదు. త్వరగా ఇల్లు చేరాలి. ఆటోలో ఇంకెవరితోనన్నా వెళ్తే సగం ఫేర్‌తోనే త్వరగా ఇల్లు చేరవచ్చునే ఉద్దేశంతో నీ మాటలు విన్నా ఆటో ఎక్కాను. నీ మాటలు విని చనువు తీసుకుంటే వాళ్లకి బుద్ధిచెప్తానని కదూ అంటున్నావు. ఇందాక వస్తానన్నావు, ఇప్పుడు రానంటావేమిటి? అని నేనే అల్లరిపెడితే నీ పరువేం అవుతుంది? మీ నాన్నగారు నాకు తెలుసు. ఆయన ఎంతో కష్టపడి నీకు, మీ చెల్లెళ్లకు చదువు చెప్పిస్తుంటే బుద్ధిగా చదువుకోక, స్నేహితురాళ్లతో పందాలు వేసి, విలువైన కాలాన్ని, జీవితాన్ని వృధా చేస్తున్నావా? ఇలాంటి ప్రయోగాలు ఎప్పుడూ చేయకు" అనేసి వెళ్లిపోతున్న అతనిని చూస్తూ, "మగవారి మాటలకు, చర్యలకు అర్థాలు తీస్తూ, వారి ప్రవర్తనను దుయ్యబడుతూ కాలక్షేపం చేసే నేను ఈ రోజు మీ వలన మధ్యతరగతి మనుషుల మనస్తత్వాన్ని అర్థం చేసుకున్నాను. మగవాళ్లందరూ చెడ్డవారే అనే నా అభిప్రాయాన్ని మార్చుకుంటున్నాను" అంటూ నా చేతిలో డబ్బులు పెట్టింది మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన ఆ అమ్మాయి.

—అగ్నిహోత్రుడు
పరిమెళ్ళ

## దొరల్లో దొంగ

ఆ కాలనీనుంచి బస్సు బయలుదేరింది. ఆఫీసులకు వెళ్ళే సమయమేమో బస్సు నిండా జనం కిటకిటలాడుతున్నారు. 'టికెట్, టికెట్' అంటూ కుడిచేత్తో చిటికెలు వేస్తూ, పద్మవ్యూహంలో అభిమన్యునిలా బస్సులో ఆ చివరనుంచి ఈ చివరదాకా తిరుగుతున్నాడు కండక్టర్ పరందాసు.

బస్సు నాంపల్లి దాటి లక్డీకాపూల్ వైపు వెళ్తోంది. 'టికెట్' మంత్ర జపం చేస్తూ తిరుగుతున్నాడు కండక్టర్. ఇళ్ళదగ్గర దొరకని నిద్రను అనుభవిస్తున్నారు కొందరు కూర్చుని, నిలుచుని కూడా. వేగంగా వెళ్తున్న బస్సు సడన్‌గా మలుపు తిరగడంతో ఒకళ్లమీద మరొకరు పడిపోయారు. నిద్రలోంచి ఉలిక్కిపడి లేచినవాళ్ళూ, బస్సు మధ్యలో వున్నవాళ్ళు, డ్రైవర్ దాకా జరిగిపోయినవాళ్ళు, అరుపులూ రకరకాల కామెంట్స్‌తో బస్సంతా గందరగోళంగా తయారయింది. కండక్టర్ తన ధోరణిలో తను వెళ్తున్నాడు. ఆ ధోరణిలో భాగంగానే ఒకతని దగ్గరకు వచ్చి టికెట్ కోసం అడిగాడు. జేబులో చెయ్యి పెట్టుకున్న ఆ వ్యక్తి మొహం వెలవెలపోయంది. గబగబా మిగతా జేబులు కూడా వెతుక్కున్నాడు. "సార్! నా పర్సు పోయింది. ఇప్పుడెలా?" అంటూ ముఖం వేళ్ళాడేశాడు. "చాల్లేవయ్యా! అన్నీ కబుర్లే. అసలు పర్సనేది వుందా? అంతా డ్రామానా?" కండక్టర్ నిలదీస్తున్నాడు. తను చెప్పింది నిజమేనంటూ ఆ వ్యక్తి లబలబమంటున్నాడు.

బస్సు లక్డీకాపూల్‌కి వచ్చింది. "ఇదిగో బాబూ! టికెట్ తీసుకోకపోతే సరే, ఇక్కడ దిగిపో నాయనా! అసలే చెకింగ్ పాయింటు" అంటూ కండక్టర్ వెనక డోర్‌నుంచి దిగి, ముందు డోర్‌వైపు వెళ్తూ అరిచాడు. పర్సు పోయిన వ్యక్తి పాపం వెలవెలపోయిన ముఖంతో కిందికి దిగిపోయాడు.

బస్సు సచివాలయం దగ్గరికి వచ్చి ఆగింది. బస్సంతా ఖాళీ అయిపోయింది. అందరూ దిగిపోయాక, భుజానికి తోలు బ్యాగు తగిలించుకున్న వ్యక్తి దిగిపోయి, ఎన్.టి.ఆర్. ఘాట్‌వైపు వెళ్ళి కొద్ది దూరం నడిచి ఎడమవైపు మింట్ కాంపౌండ్‌వైపు వెళ్ళాడు. ఫెన్సింగ్ కట్టివున్న చోట ఆగి అటూ ఇటూ చూశాడు. కనుచూపు మేరలో ఎవరూ లేరు. ఒకరు అరా వున్నా ఎవరి పనులు వాళ్లవి. మరోసారి అటూ ఇటూ చూసి బ్యాక్ పాకెట్‌లోకి చెయ్యిపెట్టి తీశాడు. మెరూన్ కలర్‌లో ధగధగ మెరిసిపోతోంది పర్సు. జిప్పు లాగి చూశాడు. ఆరు వంద రూపాయల నోట్లు, కొంత చిల్లర, ఏవో కొన్ని కాగితాలు. గబగబా డబ్బంతా తీసుకుని జేబులో వేసుకుని పర్సు విసిరి గిరాటువేశాడు తుప్పల్లోకి. ఏమీ ఎరగనట్టు మళ్ళీ బస్సు ఆగివున్నవైపు నడిచాడు... కండక్టర్ పరందాసు...

—మాదిరాజు రమేష్‌చంద్ర

## మార్పు

"ఆడపిల్లయితే అబార్షన్ చేయించాలి. అని గట్టిగా నిర్ణయించుకున్నాడు రాజారాం. ఆరోజు ఆఫీసు నుంచి ఇంటికి రాగానే భార్యతో త్వరగా రడీ అవు హాస్పిటల్ కు వెళ్లి చూపించుకుందాం" అన్నాడు రాజారాం. అతని భార్యకు తన మనసులోని మాట తెలియదు. ఇద్దరు కలిసి ఒక మంచి నర్సింగ్ హోం కు వెళ్లారు. పేషంట్లు ఎక్కువగా వుండటం వల్ల క్యూలో కూర్చోవలసి వచ్చింది. రాజారాం వచ్చే పోయే పేషంట్స్‌ని గమనిస్తూ కూర్చున్నాడు. అప్పుడే డాక్టర్ రూంలో నుంచి ఇద్దరు వృద్ధ దంపతులు బయటకు వచ్చారు. ఆ ముసలి వ్యక్తికి తలకు పెద్ద బ్యాండేజి కట్టి ఉంది. ఆ ముసలావిడ తన భర్తను పట్టుకుని తీసుకువస్తుంది. అతను చాలా నీరసంగా ఉన్నాడు. రాజారాం భార్య, ప్రక్కన కూర్చున్న ఒక పెద్దావిడ ఆ ముసలావిడను ఏమైందమ్మా? అని అడిగారు. ఆవిడ బాధ పడుతూ నా కొడుకు, కోడలు మాటలు విని నన్ను పెద్దగా కేకలేసాడమ్మా, మా ఆయన ఊరుకుండక 'ఎందుకురా అమ్మ మీదకు వస్తున్నావు? నీ భార్యను అదుపులో వుంచుకో?" అన్నాడు. దానికి నా కొడుకు కోపంతో తండ్రి అని చూడకుండా మా ముసలాయన్ని తోసేసాడు. దానితో తలకు పెద్ద గాయం అయింది అని చెప్పి ఆ వృద్ధ దంపతులు వెళ్లిపోయారు. రాజారాంకు వాళ్ల స్థానంలో తను, తన భార్య కనిపించారు. దానితో అతని మనసు కలత చెందింది. డాక్టర్ తన భార్యను చెకప్ చేసింది. నాల్గవ నెల అని నిర్ధారించింది. డాక్టర్ రాజారాం వైపు తిరిగి స్కానింగ్ చేయిస్తారా? అని అడిగింది. లేదు డాక్టర్ స్కానింగ్ వద్దు చెప్పాడు డాక్టర్‌తో రాజారాం.

—బి.భువనేశ్వరి.

కొత్త రచయితలు మాత్రమే ఇన్లాండ్ కవర్‌మీద కథలు రాసి పంపాలి.